క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నందిగామ రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ మద్దుకూరి రామారావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారీల చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ నూతన విధానంపై ఆయన అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు అంకురావు, వీరాస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

విజన్ - 2047పై సమీక్షా సమావేశం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజన్ - 2047పై మండల ప్రత్యేకాధికారి బాలాజీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విజన్ - 2047ను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకంగా డాక్యుమెంట్ తయారు చేయడం జరిగిందని, అందులో పొరపాట్లు ఉంటే శాఖల వారీగా సరిచూసుకోవాలని చెప్పారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఇన్చార్జ్ తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారంతో ఆరోగ్యం

నందిగామ రూరల్: బలవర్ధక ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యను నివారించవచ్చని గరికపాడు కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి పేర్కొన్నారు. పట్టణంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బాలికల్లో రక్తహీనత నివారణపై విస్తరణ విభాగాలు, ఐసీడీఎస్ సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలను గుర్తించి, వారికి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ముఖ్యంగా రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, రాగులు, సజ్జలు వంటి వాటిని విధిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని చెప్పారు. దీని వల్ల సహజ ఎరువులతో పండిన తాజా ఆకుకూరలు, కాయగూరలు లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ముందు వరుసలో ఉంటుందని యూటీఎఫ్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సుందరయ్య పేర్కొన్నారు. స్థానిక కంచికచర్ల ఎంఆర్సీ భవన్ కార్యాలయంలో శుక్రవారం కంచికచర్ల, వీరులపాడు మండల యూటీఎఫ్ సమీక్షా సమావేశం జరిగింది. ముందుగా యూటీఎఫ్ సంఘ కమిటీని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ కంచికచర్ల మండల అధ్యక్షుడిగా ఫణీంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా కామా ప్రభాకరరావు, గౌరవాధ్యక్షుడిగా ఉలవలపూడి సుందరరావు, ఉపాధ్యక్షులుగా జి. కృష్ణ, ఎన్. దుర్గాదేవి, కోశాధికారి మల్లారపు రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, వారి సర్వీస్ 62 ఏళ్లపాటు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



పాత వేమవరం మలుపు వద్ద గుంతలు పడిన రహదారి



వరదలకు దారుణంగా దెబ్బతిన్న పెనుగంచిప్రోలు - పాతవేమవరం మధ్య రహదారి



పాతవేమవరం - కొత్తవేమవరం మధ్యలో అధ్వానంగా రహదారి

మండలంలోని పెనుగంచిప్రోలు నుంచి వత్సవాయి మండలం వేమవరం వెళ్లే రహదారి మొత్తం దారుణంగా దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారింది. సుమారు ఐదు కిలో మీటర్లు ఉన్న ఈ రహదారి వర్షాలకు, వరదలకు పెద్ద పెద్ద గోతులు పడటంతో పాటు తారు కొట్టుకుపోయి కంకర బయట పడటంతో అధ్వానంగా ఉంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ రహదారి గుండా తెలంగాణాలోని బోనకల్, ఖమ్మం ప్రాంతాల నుంచి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. కాబట్టి అధికారులు స్పందించి ఈ రహదారి మరమ్మతులు తక్షణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వేమవరం(పెనుగంచిప్రోలు)

నేడు పాలకవర్గ సభ్యులకు అభినందన సభ

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న సత్యమ్మ అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల అభినందన సభను శనివారం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మంచాల మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఆలయ చైర్మన్‌తో పాటు సభ్యులు తొండపు పుణ్యావతి, కంసాని రమాదేవి, దర్శి పుష్పావతి, మోదుల నాగమణి, కొత్తమాసు వెంకట నాగ రాజరాజేశ్వరరావు, బెల్లంకొండ కాంతారావు, సూర్యవరపు శ్రీనివాసరావు, ఐలపోగు రాంబాబు, ఎర్రబండి మణిల అభినందన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

సీజేఐ గవాయిపై దాడి హేయమైన చర్య



పేటలో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో మందకృష్ణ మాదిగ



నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన నాయకులు, న్యాయవాదులు

మందకృష్ణ మాదిగ

జగ్గయ్యపేట అర్బన్: గౌరవ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడి దళితుల ఉనికి మీద జరిగిన దాడి అని, అది హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణానికి వచ్చిన ఆయన ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల సీజేఐ గవాయి మీద జరిగిన దాడికి నిరసనగా నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడి దళితుల ఆత్మగౌరవం మీద, రాజ్యాంగం మీద జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఈ దాడిని కేంద్రంలో అధికార, ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయని, ప్రధాని నరేంద్రమోదీ కూడా సీజేఐ గవాయితో మాట్లాడి ఖండించారని తెలిపారు. జాతీయ స్థాయిలో దేశం మొత్తం తీవ్రంగా ఖండించినా కానీ ఇప్పటి వరకు దాడి చేసిన వారిపై కేసు పెట్టడం గానీ, అరెస్ట్ చేయడం గానీ జరగకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..

ఈ సంఘటనపై తెలంగాణా, ఆంధ్రాతో పాటు ఎమ్మార్పీఎస్ ఎన్ని రాష్ట్రాల్లో ఉందో అన్ని చోట్ల ఈ నెల 12న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేశామని మందకృష్ణ మాదిగ తెలిపారు. ముందుగా దక్షిణాది రాష్ట్రాల్లో నిరసనలు చేపట్టామని, భవిష్యత్‌లో ఉత్తరాది రాష్ట్రాల్లో పోరాటాలు చేస్తామన్నారు. చలో హైదరాబాద్, చలో అమరావతి, చలో చెన్నై, చలో బెంగళూరు వంటి కార్యక్రమాల ద్వారా మా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. హైదరాబాద్‌లో జరగబోయే ఉద్యమం గురించి ఈనెల 19న వరంగల్‌లో తెలంగాణా రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సమావేశం జరగనుందని తెలిపారు. అనంతరం ఎమ్మార్పీఎస్ శ్రేణులతో కలిసి తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు.

నందిగామలో నిరసన ర్యాలీ

నందిగామ టౌన్: సీజేఐ గవాయిపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో శుక్రవారం దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసి ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు మాట్లాడుతూ దాడికి యత్నించిన న్యాయవాదిని తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రామారావు, ఏడుకొండలు, యాకోబు, న్యాయవాదులు నంద్రు బాబు విద్యాసాగర్, అద్దంకి మణిబాబు, కోట దేవదాసు, పగిడాకుల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పని గంటలు పెంచడం అన్యాయం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్



కార్మికులకు అవగాహన కలిగిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్

నందిగామ రూరల్: కూటమి ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని వాటర్ ట్యాంకుల వద్ద కార్మికుల పని గంటల పెంపును నిరసిస్తూ ఎనిమిది గంటల పని పునరుద్ధరణకు పోరాడాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన కరపత్రాలు పంపిణీ చేసి కార్మికులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం 10 గంటలకు మార్చడం హేయమైన చర్యన్నారు. పని గంటలను తగ్గించడంతో పాటు వారంలో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనధికారికంగా 10 నుంచి 12 గంటలు పని చేయిస్తూ కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పని గంటల పెంపుపై కార్మిక సంఘాలతో కనీస చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. కనీస వేతన చట్టాన్ని కూడా కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాసరపు సైదా, పుట్టా మాణిక్యం, గరికపాటి ప్రసాద్, రాజారత్నం, రూతుమ్మ, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ



కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కంచికచర్ల: కంచికచర్లలో పంచాయతీ నిధులు గోల్‌మాల్ అవ్వగా శుక్రవారం జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎల్‌వీ రాఘవన్ విచారణ చేపట్టారు. వివిధ పన్నుల రూపంలో పంచాయతీ సిబ్బంది నాగులు, జంగా వెంకటగుప్తాలు వసూలు చేసిన రూ. 24లక్షల సొమ్మును పంచాయతీ సిబ్బంది జమ చేయకుండా ఉన్నారు. వాడుకున్న సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో ఆ కాజేసిన సొమ్ముపై ఆరా తీశారు. ముందుగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్.సుబ్రహ్మణ్యం, ఇందుపల్లి నానిబాబు, పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లూరి మృతి సాహితీ రంగానికి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని వేముల ఛారిటీస్ వ్యవస్థాపకుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. నగరానికి చెందిన కవి, సాహితీవేత్త, పత్రికా సంపాదకుడు కొల్లూరి మృతికి గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. గత నలభై సంవత్సరాలుగా సాహితీ, సేవా రంగాలలో కొల్లూరి కృషి వెలకట్టలేనిదన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ద్వారా అనేకమంది యువ కవులను తయారు చేశారని చెప్పారు. ప్రతి సంవత్సరం మహాకవి శ్రీశ్రీ పేరుతో పురస్కారాలను అందజేసేవారని పేర్కొన్నారు.

పలు సాహిత్య సంస్థల ప్రతినిధుల సంతాపం

ఎక్స్‌రే కొల్లూరి మృతికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, గోళ్ళ నారాయణరావు కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ సభ్యులు, చింతకాయల చిట్టిబాబు(తెలుగు కళావాహిని), పరుచూరి విజయలక్ష్మి(మహానటి సావిత్రి కళాపీఠం), శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంపల్లి అశోక్ కుమార్, యువ కవులు అనిల్ డ్యానీ, విద్యావేత్త బండ్ల మాధవరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, విద్యావేత్త ఎంసీ దాస్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, దామోదర గణపతిరావు, కలిమిశ్రీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కొల్లూరి మృతదేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో సెంటర్ వద్ద ఉన్న ఇండోర్ సబ్ స్టేషన్, తొర్రగుంటపాలెం సబ్‌స్టేషన్, బలుసుపాడు రోడ్‌లోని సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా జగ్గయ్యపేట మున్సిపల్ ప్రాంతాలు, కె.అగ్రహారం, ముక్త్యాల, త్రిపురవరం, బూదవాడ రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆమె పేర్కొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ అష్టోత్తర శత కల్యాణం



నందిగామ టౌన్: పట్టణంలోని భగవాన్ సత్య సాయి సేవా సమితి భవనంలో లక్ష్మీనారాయణ అష్టోత్తర శత కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన మంటపంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, సత్యసాయి సేవా సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ నియామకం

నందిగామ రూరల్: మండలంలోని పెద్దవరం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీని నియమిస్తూ శుక్రవారం కోఆపరేటివ్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా జమ్మలమూడి హనుమంతరావు, సభ్యులుగా మిరియాల గోపయ్య, గడ్డం నాగమ్మలను నియమించినట్లు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ



నందిగామ టౌన్: దీపావళి పండుగ సందర్భంగా పేదలకు దాతల సహకారంతో తమ వంతుగా అండగా నిలవడం అభినందనీయమని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో అందజేసిన బియ్యాన్ని శుక్రవారం ఆయన పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డంకి కాదని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు. చదువుతోనే ఏదైనా సాధించగలమని తెలిపారు. ముఖ్యంగా పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పారేపల్లి సాయిబాబు, పబ్బతి జనార్దనరావు, పూర్ణ, పొలిశెట్టి వెంకటరావు, పొలిశెట్టి ఉపేంద్ర, పొలిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు



నందిగామలో ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

జగ్గయ్యపేట: ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం తగదని సీనియర్ పాత్రికేయులు ముత్యాల సైదేశ్వరరావు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్‌లపై విచారణ పేరుతో పోలీసుల వేధింపులకు నిరసనగా శుక్రవారం జగ్గయ్యపేట ప్రెస్ క్లబ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు యలదండి శ్రీనివాసరావు, అల్లి రవిచంద్, ఆంబోజి శివాజీ, జుజ్జవరపు వెంకట్రావ్, వల్లాపరపు వెంకటేశ్వరరావు, యనమదల నాగేశ్వరరావు, షేక్ నాగుల్‌మీరా, పులికొండ సాంబశివరావు, మైలా విజయ్‌పాల్, మామిళ్లపల్లి అప్పారావు, ఆశీర్వాదం, ఆనంద్ బాబు, గోపి, షేక్ బాషా, షేక్ నజీర్, శేషు, నారిశెట్టి శ్రీనివాసరావు, సోమోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ టౌన్: సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డితో పాటు నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్‌లపై పోలీసుల వేధింపులను వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలది సుగుణశేఖరరావు, ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వైస్ ప్రెసిడెంట్ పఠాన్ మీరాహుసేన్, పాత్రికేయులు పఠాన్ సైదాఖాన్, అబ్దుల్ హమీద్, బొక్కా ప్రభాకర్, టీవీ నరసింహారావు, న్యాయవాదులు అద్దంకి మణిబాబు, పగడాకుల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జగ్గయ్యపేట కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: నందిగామ సీనియర్ న్యాయవాది బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, జూనెబోయిన శ్రీనివాసరావు, బూడిద నరసింహారావు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాసరావు, గోనెల వెంకటేశ్వర్లు, ఎం.గోపినాథ్, టి.ఎల్. నరసింహారావు, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పి.నాగరాజు, దాసరి నాగేశ్వరరావు, కృష్ణంరాజు, మురళి, శ్రీనివాసగౌడ్, దాసరి వెంకటకృష్ణ, రత్నబాబు, ప్రతాప్‌రెడ్డి, చిన్నగాంధీ, శేషకుమారి, జ్యోతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు బాధాకరం

నందిగామ రూరల్: న్యాయవాది బండి మల్లికార్జునరావుపై కంచికచర్ల పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి నందిగామలోని కోర్టు ఆవరణలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంగా న్యాయవాదులపై కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి మల్లికార్జునరావుతో పాటు న్యాయవాదులపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కన్నెగంటి జీవరత్నం, ఈశ్వరప్రగడ రంగారావు, మన్నెం నారాయణరావు, పీఎల్ నరసింహారావు, మందా వజ్రయ్య, షేక్ సైదా, అద్దంకి మణిబాబు, పాలెపు వెంకట నరసింహారావు, యరగొర్ల రామారావు, ఎక్కిరాల హనుమంతరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఆదాయ మార్గాలుంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యంగా అభివృద్ధి ప్రణాళికల్లో తొమ్మిది సూత్రాలుంటాయని వాటి ప్రకారం గ్రామానికి ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పన్నుల వసూళ్లు కూడా నూరు శాతం చేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మావతి, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చిత్రకారుడు సన్నాల సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, డ్రీమ్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిత్రకారుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ సంస్మరణ సభను ఈనెల 19 వ తేదీ ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు, చిత్రకారుడు రమేష్ శుక్రవారం తెలిపారు. చిత్రకళా ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వత్సవాయి: మండలంలో బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ సాధించిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు డీటీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని మక్కపేటలో నిర్వహించారు. బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్‌లో మక్కపేట, ఎంపీపీఎస్, భీమవరం, వత్సవాయి మెయిన్, పోలంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలు నిలవగా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అందరికీ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను సన్మానం చేశారు. అదేవిధంగా నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారికి కూడా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంలో డీటీఆర్టీయూ ముందంజలో ఉందన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదు వేగవంతంగా సాగుతోందని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షునికి సంఘ సభ్యులు సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై.మల్లేశ్వరరావు, ఎంఈఓ ఎల్. నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల అధ్యక్షుడు జక్కా రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి షేక్ జాను, సభ్యులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.